



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న యుటిఎఫ్ నాయకులు

# వినియోగదారుల హక్కులపై అవగాహన

- జెసి నూరుల్ ఖమర్

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

వినియోగదారులు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. గురువారం జాతీయ వినియోగదారుల దినోత్సవం-2025 సందర్భంగా గాయత్రి జూనియర్ కళాశాల నుండి కలెక్టరేట్ వరకు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారులను చైతన్య పరిచేందుకు వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఈరోజు వినియోగదారుల అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజులపాటు కళాశాలలో, పాఠశాలలో తదితర ప్రదేశాలలో వినియోగదారుల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, కొనుగోలు చేసే ప్రతి వస్తువు, సేవకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మోసపూరిత ప్రకటనలు, అధిక ధరలు, నాణ్యత లేని వస్తువులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వినియోగదారుల ఫోరమ్‌లను ఆశ్రయించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం కమిషన్ జిల్లా అధ్యక్షులు కిషోర్ కుమార్, కమిషన్ సభ్యులు నారాయణరెడ్డి, కౌసర్ బేగం, డిఎస్ఒ రాజా రఘువీర్, వినియోగదారుల ఫోరం సెక్రెటరీ శివ మోహన్‌రెడ్డి, వినియోగదారుల అసోసియేషన్ మెంబర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జెసి, అధికారులు

**సివిల్ సప్లయ్ గోడౌన్లలో జెసి తనిఖీ**

నగరంలోని చాణిక్యపురి కాలనీలోని పౌరసరఫరాల గోడౌన్లలో గురువారం జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్ స్టాక్ రిజిస్టర్లు, నిల్వల లెక్కలను క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాములో నిల్వ ఉన్న ధాన్యం,నిత్యావసర సరుకుల భద్రత, నాణ్యత, నిల్వ విధానాలపై గోడౌన్ ఇన్‌చార్జితో చర్చించారు. గోడౌన్ ఆవరణ పరిశుభ్రత, శానిటేషన్ పరిస్థితులు మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని సూచించారు. గోదాములలోని చిన్న చిన్న మరమ్మతులు తక్షణమే చేపట్టాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లు రోజువారీగా అప్డేట్ చేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరుకుల నిల్వలు, పంపిణీ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఎటువంటి లోపాలు, వ్యత్యాసాలు తలెత్తకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని గోడౌన్ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ నాగమణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**రైతులకు అండగా నిలవాలి : జెసి**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

రైతులకు అధికారులు అండగా నిలిచి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అన్నారు. గురువారం కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో నిర్వహించిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... శాస్త్రీయ వ్యవసాయం ద్వారా రైతు సంక్షేమం సాధించడం, రైతుల పెట్టుబడి భారం తగ్గించడం, పండించిన పంటకు న్యాయమైన, లాభదాయక ధరలను కల్పించడం, వ్యవసాయ సేవలను గ్రామ స్థాయికి సమర్థంగా అందించడం, వ్యవసాయ ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెటింగ్ అవకాశాలను కల్పించడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ సేవలు చేరేలా సమర్థవంతంగా పని చేయాలని అధికారులకు సూచించారు. రైతులు ప్రస్తావించిన పంట నిర్వహణ, ఇన్‌పుట్ లభ్యత, సాగునీరు, మార్కెటింగ్ వంటి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమానికి ఎడిఎ సాలు రెడ్డి, కర్నూలు తహశీల్దార్ టివి రమేష్, మండల వ్యవసాయ అధికారి రుఫస్ రోనాల్డ్, గ్రామ సర్పంచి యేసేపు, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖ ఫీల్డ్ సిబ్బంది, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి నూరుల్ ఖమర్

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఎత్తేయాలి

**-రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ -కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ నిరసన**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఎత్తివేయాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్‌కుమార్ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు యుఆర్ఎ రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కే సురేష్ కుమార్ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ లో ఉన్నటువంటి ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహించడం సరైనది కాదన్నారు. టెట్ పరీక్షను ఉపసంహరించుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టంలో మార్పు చేసిందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జనవరి 29న చలో పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే రివ్యూ పిటిషన్ వేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటీ మాట్లాడుతూ ఇన్‌సర్వీస్‌లోని ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా సహాధ్యక్షులు హేమంత్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా గౌరవ అధ్యక్షుడు దావీదు, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, ఇబ్రహీం, భాస్కర్, గాద లింగన్న, వెంకటేష్ ,లక్ష్మీదేవి, బాబు, కౌలన్న సురేష్, చంద్రకళ ,సురేష్ బాబు లక్ష్మీకాంత్ నాయక్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు చంద్రపాల్, రాష్ట్ర కౌన్సిలర్లు మల్లాది నాగరాజు, కృష్ణవేణి, ఖాసీం, ప్రసాద్‌బాబు, పద్మావతి పాల్గొన్నారు.

## బీమా రంగంలో విదేశీ పెట్టుబడులపై నిరసన

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఈనెల 3న లోక్ సభలో బీమా చట్టాల బిల్లు 2025 ప్రవేశపెట్టారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ కర్నూలు ఎల్ఐసి బ్రాంచ్ ఆవరణలో గురువారం భోజనం విరామ సమయంలో ఆర్.సునీయకుమార్ ఆధ్వర్యంలో జాయింట్ నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ... భారతదేశ ప్రైవేట్ ఇన్సూరెన్స్ రంగంలో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడును వ్యతిరేకిస్తూ ఈ బిల్లు మోసపూరతంగా ఉందన్నారు. 'దిసబ్‌కా బీమాసబ్‌కి రక్ష' బిల్లు 2025 అనే పేరు పెట్టారు. ఈ బిల్లు తప్పనిసరిగా ప్రజా ప్రయోజనాలకు దెబ్బతీసే విధానాన్ని చట్టబద్ధం చేయడానికి ప్రభుత్వం ప్రజల అనుకూల రాక్షస తత్వాన్ని అమలు చేసిందన్నారను. బీమా చట్టం 1938, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ చట్టం 1956 , ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 1999 చట్టాలకు తూట్లు పరిచే విధంగా పాలసీదారుల ప్రయోజనాలకు దెబ్బ తీసే విధంగా ఈ చట్టం రూపొందించారన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 నుండి 100 శాతానికి పెంచడం వలన ఫారిన్ కంపెనీ లకి పెద్ద మొత్తంలో అవకాశం (యాక్సెస్) లభిస్తుంది తప్ప దేశీయ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఎలాంటి లాభం ఉండదన్నారు. ఇప్పుడున్న 74శాతం ఎఫ్‌డిఐ పరిమితి దాదాపు ఏ ఒక్క ప్రైవేట్ కంపెనీ కూడా పూర్తిగా వినియోగించుకోలేదన్నారు. 25 ప్రైవేట్ కంపెనీలలో కలిపి ఇప్పటి వరకు కేవలం 32శాతం మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సగటున ఉన్నట్లుగా ప్రభుత్వ లెక్కలున్నాయన్నారు. ఇప్పుడు ఈ ఎఫ్‌డిఐల పరిమితి 100 శాతానికి పెంచడం ద్వారా మొదటి ప్రమాదమన్నారు. స్వదేశీ కంపెనీలు విదేశీ కంపెనీలకు తమ వాటా మొత్తాన్ని అమ్ముకొని ధారాదత్తమైపోయే ప్రమాదం ఉందన్నారు. రెండోదని ఏర్పడబోయే కొత్త ప్రైవేట్ కంపెనీలన్నీ వందశాతం విదేశీ పెట్టుబడితో ఏర్పాటయి, సదరు విదేశీ కంపెనీల ప్రాబల్యం భారత ఇన్సూరెన్స్ మార్కెట్ పై పెరుగనున్నదన్నారు. ఇక మూడోది భారతదేశ ప్రజల పొదుపుపై విదేశీ కంపెనీల ఆధిపత్యం మరింత పెరుగనున్నదన్నారు. దేశీయ కంపెనీలు గానీ, లేదా ప్రజానీకం గానీ ఈ పెంపును కోరుకోలేదన్నారు. కేవలం విదేశీ పెట్టుబడికి తలొగ్గి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నదన్నారు. అంతర్జాతీయ పెట్టుబడి అజమాయిషీ మన దేశంపై ప్రబలంగా ఉన్నది అనడానికి ఇది నిదర్శనమన్నారు. ఈ ఎఫ్‌డిఐ పెంపు ద్వారా సబ్కా బీమా సాధించడమనే స్లోగన్ అర్థరహితమన్నారు. అందరికీ 1947 నాటికి బీమా సౌకర్యాన్ని అందివ్వాలంటే ప్రజల చేతిలో కొనుగోలు శక్తి పెరగాలి తప్పా, విదేశీ కంపెనీలొచ్చి పాలసీలను అమ్మడానికి ప్రయత్నిస్తే జరగదన్నారు. పైగా పట్టణ వ్యాపారమంతా విదేశీ కంపెనీల దారదత్తమయ్యే ప్రమాదముందన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి సంఘీభావంగా ఎస్‌బిఐ బ్యాంక్ యూనియన్ నాయకులు సాగర్, యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు అనిల్ కుమార్, ఎల్ఐసి క్లాస్ వన్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు రాజశేఖర్ శర్మ, ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ యూనియన్ అజయ్ కుమార్, రమేష్, ఎల్ఐసి ఏజెన్సీ యూనియన్ గజేంద్రరెడ్డి, కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మక్బుల్ అహమ్మద్, టి.రమేష్, అంబుజ జి సింగ్, ఉస్మాన్ గని, ఉస్మాన్ భాష, శకుంబి పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న నాయకులు

## 'ఉపాధి హామీ' రక్షణకు 20న నిరసనలు

**- వ్యకాస, ఎపి రైతుసంఘం, సిఐటియు**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు ఎండి అంజిబాబు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని జీ రామ్ జీ అని పేరు మారుస్తూ చట్టాన్ని పథకంగా మార్పు చేసి నిధులు తగ్గించి ఉపాధి హామీ పథకాన్ని నిర్మిర్యానికి కుట్ర చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఈనెల 20న గ్రామ, మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి. నారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు తెలిపారు. కార్మిక కర్షక భవనంలో మూడు సంఘాల నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదవాడికి పట్టెడన్నం పెట్టే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్పు చేసి వారికి కేటాయించిన నిధుల్లో 60 శాతం కేంద్ర ప్రభుత్వం 40శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాలని, అలాగే చట్టాన్ని పథకంగా మార్పు చేసి కాలక్రమంగా ఉపాధి హామీ పథకాన్ని పేదలకు దూరం చేయాలని ఒక దుర్బుద్ధితో కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. పార్లమెంట్లో అడ్డగోలుగా ఆమోదం తీసుకొని పేదలకు ఉపాధి దూరం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మన రాష్ట్రంలో ఈ ఉపాధి హామీకి ప్రతి ఏడాది రూ.4000 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందని, అయినా నిస్సిగ్గుగా పార్లమెంట్లో అధికార ప్రతిపక్ష ఎంపీలు ఆమోదానికి ఓటు వేయడం సిగ్గుచేటని విమర్శించారు. కర్నూలు జిల్లాలో నిత్యం కరువు కాటకాలతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ఏటా 10 లక్షల మంది సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. వలసల నివారణ కోసం తెచ్చిన ఈ చట్టాన్ని రూపుమాపి నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే నోరు మెదపని దౌర్భాగ్య పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. గ్రామీణ పేదలకు, రైతులకు, కార్మికులకు, వరంలా ఉండే ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుంటామని అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 20న నిర్వహించే గ్రామ మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## మాతృ మరణాలపై డిఎంహెచ్ఒ సమీక్ష

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

మాత మరణాలపై సమీక్ష సమావేశం (ఎండిఎస్ఆర్) డిఎంహెచ్ఒ కార్యాలయంలో జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిడ్డకు జన్మనిస్తూ ఏ తల్లి చనిపోకూడదని ఏ శిశువు జన్మించే సమయంలో మృతి చెందకూడదాని తెలిపారు. ప్రతి గర్భిణికి 12 వారాలలోపు అన్ని రకాల వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందజేయాలని హై రిస్క్ గర్భవతులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని, గర్భవతులకు, బాలింతలకు పౌష్టికహారం గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దికెర, పెద్ద హరివాణం, గోనెగండ్ల, గూడూరు, నందవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రలు పట్టణ ఆరోగ్యకేంద్రం స్టాంటన్‌పురం పరిధిలో జులై , ఆగష్టు నుండి నవంబర్ 2025 నెలలో సంభవించిన 6 ప్రసూతి మరణాలపై సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు గర్భవతులను వీలైనంత తొందరగా గుర్తించి వారికి సరైన సమయంలో సమయానుసార వైద్య సేవలు అందించినట్లయితే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. ఒకవేళ ఆ గర్భవతులలో ( ప్రమాదకర చిహ్నాలు ) హై రిస్క్ గా గుర్తించినట్లయితే ఆరోగ్య కార్యకర్త, ఆరోగ్య పర్యవేక్షులతో ట్రాక్ చేసి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్య శాలలో చికిత్స అందించినట్లయితే మాతా శిశు మరణాలను తగ్గించవచ్చని అంతే కాకుండా హై రిస్క్ గర్భవతిని కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే ట్యాగ్ చేయబడిన ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉమా, డిపిఎంఒ డాక్టర్ శైలేష్ కుమార్, ఆదోని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ సత్యవతి, గైనకాలజీ విభాగం హెచ్‌ఒడి డాక్టర్ సావిత్రి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి, అనస్తీసియా డాక్టర్ మురళి ప్రభాకర్, జనరల్ మెడిసిన్ డాక్టర్ దివ్య, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్, బ్లడ్ బ్యాంకు డాక్టర్ రంగస్వామి, డిపిహెచ్‌ఎన్ఒ అన్నపూర్ణ, పిహెచ్‌ఎన్ మీనాక్షి, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్



జాతీయ పోటీలకు ఎంపికయిన విద్యార్థులుతో సిఇఒ గోపినాథ్ తదితరులు

## జాతీయ ఫుట్‌బాల్‌కు అఫన్, జ్యోతిస్వరూప్

**ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్**

ఖేలో ఇండియా ఫుట్ బాల్ పోటీలకు రిడ్జ్ పాఠశాలకు చెందిన అఫన్, జ్యోతిస్వరూప్ ఎంపికయ్యారు. గత నెలలో జరిగిన అండర్ 13 లో ఇండియన్ ఖేల్ ఫుట్బాల్ జిల్లా స్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభను కనపరిచిన వీరిద్దరూ ఈనెల బెంగళూరులో జరిగే సౌత్ జోన్ ఇండియా ఫుట్బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాలలో జరిగిన అభినందన సభలో పాఠశాల సిఇఒ గోపీనాథ్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం చాలా గర్వించదగ్గ విషయం అన్నారు. ఇదే స్ఫూర్తితో సౌత్ జోన్ పోటీల్లో కూడా చక్కటి ప్రతిభను కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల కో సిఇఒ సౌమ్య గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలను అలవర్చుకోవడం వలన భవిష్యత్తులో వారు మానసికంగా దృఢంగా తయారవుతారని, తద్వారా దేశానికి మంచి పేరు ప్రఖ్యాతాలను తీసుకొని వస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్ కమల్, హెచ్‌ఒడి నాగేంద్ర, శ్రీనివాస్, కోచ్ బ్రహ్మకుమార్ పాల్గొన్నారు.



మూఢనమ్మకాలపై మ్యాజిక్‌షో ప్రదర్శిస్తున్న జెవివి జిల్లా అధ్యక్షులు బిడి సుధీర్‌రాజ్

## మూఢ నమ్మకాలపై మ్యాజిక్ షో

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

కర్నూలు నగరంలోని స్థానిక సి క్యాంపు లోని మున్సిపల్ పాఠశాలలో మూఢనమ్మకాలపై మ్యాజిక్ షో గురువారం నిర్వహించారు. జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు బిడి.సుధీర్ రాజు మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రాలకు, తంత్రాలకు, తాయత్తులకు మోసపోవద్దని, సైన్స్‌ను నమ్మాలని కోరారు. నిత్యజీవితంలో సైన్స్ మనకు ఆధారమన్నారు. శాస్త్రీయ దృక్పథం పెంపొందాలని, విద్యార్థులలో సైన్సు పట్ల అవగాహణ పెరగాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీ జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎం జయరాజు బాలయ్య, చంద్రశేఖర్ ,తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలిక విద్య, ఆరోగ్యం సామాజిక బాధ్యత

ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

బాలికల విద్యా, ఆరోగ్యం సమాజం అందరి బాధ్యత అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలో నిర్వహించిన బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలికలే సమాజ భవిష్యత్తు అని, వారికి విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడమే ప్రభుత్వాలతో పాటు సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. బాలికలపై వివక్ష, బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలు వారి అభివృద్ధిని అడ్డుకుంటున్నాయన్నారు. వీటిని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. బేటి బచావో - బేటి పడావో పథకం ద్వారా బాలికల విద్యా ప్రోత్సాహం, రక్షణ, సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే వివరించారు. తల్లిదండ్రులు బాలికలను తప్పనిసరిగా చదివించాలని, వారిని ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. చదువు ద్వారానే బాలికలు స్వయం ఆధారంగా ఎదిగి, కుటుంబం-సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. బాల్య వివాహల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాలికల భద్రత కోసం ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం బాధ్యతగా ముందుకు రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో బాలికల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు.



బేటిబచావో, బేటి పడావో కార్యక్రమంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

## మెడికవర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

కర్నూలు జిల్లా డిన్నెదేవరపాడు గ్రామంలో మెడికవర్ హాస్పిటల్స్ వారు ఎపిఇఆర్‌సిలో ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరానికి ఎపిఇఆర్‌సి చైర్మన్ విపిఆర్ రెడ్డి, కమిషన్ సెక్రటరీ కృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ దీపక్, జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్ పాల్గొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ తరపున డాక్టర్ సువర్ణ లక్ష్మి (పల్మనాలజిస్ట్), డాక్టర్ శశికిరణ్ (ఇఎన్‌టిస్పెషలిస్ట్) ఎపిఇఆర్‌సి ఉద్యోగులను పరిశీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు రక్తపోటు (బీపీ), షుగర్ పరీక్షలు, ఇసిజి, పిఎఫ్‌టి (లంగ్ ఫంక్షన్ టెస్ట్), ఇఎన్‌టి పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచన మేరకు అవసరమైన వారికి 2డిఇకొ పరీక్షలు కూడా చేశారు. ముందస్తు ఆరోగ్య పరీక్షల ద్వారా వ్యాధులను తొందరగా గుర్తించి చికిత్స చేయడం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని వైద్యులు సూచించారు. మెడికవర్ హాస్పిటల్స్ క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహించడమే మెడికవర్ లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.



మెడికవర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు చేస్తున , వైద్యులు , సిబ్బంది

## 20 నుంచి డోర్ డెలివరీ మాసోత్సవం

**ప్రజాశక్తి-కర్నూలుకార్పొరేషన్**

ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం (APSRTC) లో 'డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం' ను ఈనెల 20 నుంచి జనవరి 19వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ నున్నామని ఆర్ఎం టి. శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రచార మాసోత్సవం సందర్భంగా ప్రజలకు మరింత సౌకర్యవంతంగా పార్సెల్స్‌ను ఇంటి వద్దకే చేరవేయు సదుపాయం అందుబాటులో ఉంచామన్నారు. కర్నూలు జిల్లా పరిధిలోని అన్నీ డిపోల కార్గో కౌంటర్ల ద్వారా రాష్ట్రంలోని 87 ముఖ్య పట్టణాలకు 50 కిలోల వరకు 10 కిలోమీటర్ల పరిధిలో పార్సెల్స్ బుక్ చేసి త్వరితగతిన మీ ఇంటి వద్దకే డోర్ డెలివరీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## కోర్టు తీర్పునకు విద్యాశాఖ మోకాలడ్డు !

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా వుంది. ఆ 17 మంది ఉపాధ్యాయుల నోషనల్ సర్వీస్ విషయంలో.... ఏకంగా కోర్టు ఉత్తర్వులు అమలు పరచడం వీలుకాదంటూ విద్యాశాఖ కార్యాలయానికి లేఖ రాసిన జిల్లా విద్యాశాఖ అధికారులు. కోర్టు ధిక్కార కేసు వేయడంతో ఆ ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు మండిపడు తున్నారని ఎపిఎం టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిఎస్‌సి-2008లో భర్తీ కాకుండా మిగిలి పోయిన పోస్టులను కోర్టు ఉత్తర్వుల ద్వారా ఎక్స్‌సర్వీస్ మెన్ కోటా డీ రిజర్వ్ కాబడి సంవత్సరం పైగా కాలాయాపన తర్వాత ఎట్టకేలకు 2011లో భర్తీ చేశారని పేర్కొన్నారు. అప్పటి కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారులు, తర్వాత నోషనల్ సర్వీస్ కోసం అనేక సార్లు జిల్లా విద్యాశాఖాధికారులతో సంప్రదింపులు జరిపినా లాభం లేకపోవడంతో మొత్తం 17 మంది ఉపాధ్యాయులు రిట్ పిటిషన్ నెంబర్ 4973/2021 , రిట్ పిటిషన్ నెంబర్ 5192/2021 ల ద్వారా హైకోర్టును ఆశ్రయించారన్నారు. 2025 జనవరి 2న హైకోర్టు ఈ 17 మందికి అనుకూలంగా తీర్పు ఇచ్చి, మూడు నెలల్లోగా అమలు చేయమని పేర్కొందన్నారు. పాఠశాల విద్యా శాఖ అధికారులు కూడా ఈ రెండు రిట్‌ఫిటిషన్ల విషయంలో హైకోర్టుఉత్తర్వుల దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై ఒక మెమోను జిల్లా విద్యాశాఖ అధికారులకు ఈ ఏడాది ఫిబ్రవరి 27న విడుదల చేసిందని తెలిపారు. ఇక్కడే విద్యాశాఖ అధికారులు తమ పెత్తనం చూపించారన్నారు. అసలు ఈ 17 మంది టీచర్లకు నోషనల్ సర్వీస్ ఇవ్వడానికి ఫీజ బుల్ కాదని, హైకోర్టు ఉదాహరించిన తీర్పులు వీరి విషయంలో వర్తించవు అంటూ పాఠశాల విద్యాశాఖ అధికారులకు లేఖ రాయడం, కోర్టు ధిక్కార కేసు వేసిన టీచర్లను కార్యాలయానికి పిలిపించడం తో విషయం వేడెక్కిందని పేర్కొన్నారు.

### సిఎం చంద్రబాబుకు అవార్డు రావడం ఎపికి గర్వకారణం

**- మంత్రి టిజి. భరత్**



**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. సిఎంకు అవార్డు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. 'దార్శనికత విశ్వాసాన్ని సృష్టిస్తుంది, విశ్వాసం పెట్టుబడులను ఆకర్షిస్తుంది, పెట్టుబడి ఉద్యోగాలను సృష్టిస్తుంది' అని మంత్రి టిజి. భరత్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇది గర్వకారణమైన క్షణం అన్నారు. సీఎం చంద్రబాబు బలమైన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకెళు ..ందన్నారు.

### విజేతలకు 21న బహుమతుల ప్రదానం

**ఎపిఎస్‌పిడిసిఎల్ ఎండి**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :** ఇందన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 20, 21వ తేదీల్లో తిరుపతి పాత తిరుచానూరు రోడ్డులోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ లో సైన్స్ ఎగ్జిబిషన్ లో స్టాల్స్ పోటీలను నిర్వహిస్తామని ఎపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి వెల్లడించారు. క్విజ్, వక్తృత్వపు, స్టాల్స్ నిర్వహణ పోటీల్లో విజేతలకు ఈనెల 21వ తేదీన రాష్ట్ర ఇంధన శాఖామాత్యులు గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.



సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ అజయ్ కుమార్

## రీసర్వేను గడువులోపు పూర్తి చేయాలి

**- సబ్ కలెక్టర్ అజయ్ కుమార్**

**ప్రజాశక్తి - ఆదోని**

ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడేలా ప్రతి శాఖ పనితీరులో గుణాత్మకమైన మార్పు తీసుకురావాలని, రీసర్వేను గడువులోపు పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ (ఇన్‌ఛార్జీ) అజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రజా అవసరాలు, సమస్యలను సకాలంలో సమర్థవంతంగా పరిష్కరించినప్పుడే ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. పిజిఆర్ఎస్‌లో నమోదయ్యే ప్రతి అర్జీని కేవలం ఫార్మాలిటీగా పరిష్కరించకుండా, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిశీలన, బాధితులకు సస్పష్టమైన పరిష్కారమందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ అర్జీలు ఉండకుండా నిరంతరం పర్యవేక్షించి, పరిష్కార స్థితిని సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియపై ప్రత్యేకంగా దృష్టి సారించిన సబ్ కలెక్టర్, రెండో దశలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన గ్రామాల్లో మ్యుటేషన్ ప్రక్రియను పూర్తిచేసి, ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎక్కడైనా ఆలస్యం, నిర్లక్ష్యం లేదా లోపాలు గుర్తిస్తే సరిదిద్దే చర్యలు చేపట్టాలని, తప్పులను పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వేణు సూర్య, శ్రీనివాస రాజు పాల్గొన్నారు.

## మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ ఆకస్మిక పర్యటన

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**



పరిశీలిస్తున్న అధికారులు

మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ గుజ్జల నాగరాజు ఎమ్మిగనూరు మున్సిపాలిటీని సందర్శించి విస్తృతస్థాయిలో తనిఖీలు చేపట్టారు. గురువారం పారిశుధ్య అధికారులతో కలిసి కంపోస్ట్ యార్డ్‌ను పరిశీలించారు. ఎంఆర్ఎఫ్ విండ్ర్ కంపోస్టింగ్ ప్రక్రియలను సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను సందర్శించి ఆహార నాణ్యత, పరిశుభ్రతను, సమయపాలనను తనిఖీ చేశారు. అలాగే కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి, వివరాల సచివాలయ కార్యదర్శులతో పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... జనవరి 31, 2026 నాటికి వంద శాతం పన్ను వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పన్నుల వసూళ్లు, ప్రజలకు అందించే సర్వీసుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా జవాబుదారీ తనంతో పనిచేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి, డిఇఇలు నీరజ, రాజు నాయక్, టిపిఒ రాజేష్, ఆర్ఒ (మేనేజర్) అస్లాం బాషా పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి : జడ్‌పి సిఇఒ

**ప్రజాశక్తి - కౌతాళం**



పరిశీలిస్తున్న జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

ప్రతి గ్రామంలోనూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి విధులలో చెత్తను సేకరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. అంతకుముందు కుమ్మలనూర్ గ్రామం చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి యోగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## 'సిసిఐ నిబంధనలను ఎత్తేయాలి'

**ప్రజాశక్తి - మంత్రాలయం**

సిసిఐ నిబంధనలను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.వీరేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్ని రకాల పత్తిని కొనుగోలు చేయాలని ఆదేశించినా ఇక్కడ సిసిఐలో మాత్రం రైతులను వెనక్కి పంపుతున్నారనే ఫిర్యాదు రైతుల నుంచి వస్తున్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని అన్ని రకాల పత్తిని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతుసంఘం నాయకులు కె.యోగప్ప, రాముడు, చిన్న తిక్కన్న, పద్మ, తిక్కన్న పాల్గొన్నారు.

# సృజనాత్మకత పెంపునకు సైన్స్ ఫెయిర్

**- మున్సిపల్ కమిషనర్ కృష్ణ**

**ప్రజాశక్తి - ఆదోని**

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు సైన్స్ ఫెయిర్ ఎంతో దోహదపడుతుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డిప్యూటీ ఇఒ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. మండలంలోని 32 పాఠశాలల నుంచి 60 సైన్స్ నమూనాలను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శనకు ఉంచారు. పర్యావరణ పరిరక్షణ, మానవ శరీరాలు, అడవుల సంరక్షణ, సేంద్రీయ వ్యవసాయం, సూర్యరశ్మి, మానవ అవయవాలు, ట్రాఫిక్ వంటి నమూనాలు ఆకట్టుకున్నాయి. నమూనాలను మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డిప్యూటీ ఇఒ రాజేంద్రప్రసాద్ తిలకించారు. వాటి ఉద్దేశాలను విద్యార్థులను అడిగి వారి ప్రతిభకు పదును పట్టారు. నమూనాలపై విద్యార్థులు వివరించారు. జిల్లా స్థాయికి ఏడు పాఠశాలల నుంచి ఎంపిక చేశారు. వారు మాట్లాడుతూ... విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతిభను చాటి ముందుకు నడవాలని కోరారు. ఎంఇఒ భూపాల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులు రాజా, సతీష్, సునీల్ రాజ్ కుమార్, నాగరాజు, ఆదిమూర్తి, పుల్లం రాజు, జుబేర్, కల్యాణ్, ప్రతాప్ రెడ్డి, మల్లికార్జున, జగన్, నాగేష్ ఉన్నారు. **హోళగుంద** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సైన్స్ ఫెయిర్ ఏర్పాటుచేశారు. ఎంఇఒ-2 కబీర్ సాబ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రదర్శనలో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 42 రకాల సైన్స్, గణిత నమూనాలను ప్రదర్శించారు. మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన వారిలో హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యశ్రీ, కె.భువనేశ్వరి, హెబ్బటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అనంతలక్ష్మి, గజ్జహల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మల్లి, సులువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి హుస్సేన్ సాబ్, నయన, ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి దీపిక విజేతలుగా నిలిచారు. విజేతలు ఈనెల 20న కర్నూలు టౌన్ మోడల్ పాఠశాలలో నిర్వహించే ప్రదర్శనలో ప్రదర్శనను ప్రదర్శించాలని కోరారు. ఎంఇఒ-1 సుధారాణి పాల్గొన్నారు. **దేవనకొండ** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. వివిధ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రూపుల వారీగా, వ్యక్తిగత ప్రదర్శనలు నిర్వహించారు. సుస్థిర వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు, హరిత ఇంధనం, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ఆరోగ్యం, పరిశుభ్రత, జల సంరక్షణ, నిర్వహణ వంటి వైజ్ఞానిక ప్రదర్శనలు చేపట్టారు. దేవనకొండ, పి.కోటకొండ, నేలతలమర్రి, గుడిమిరాళ్ల, తెర్నేకల్లు పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ పర్యవేక్షించారు.



ఆదోనిలో తలకిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ, రాజేంద్రప్రసాద్



హోళగుందలో మాట్లాడుతున్న అధికారులు



దేవనకొండ



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

**- ఎడిఎ చెంగల్ రాయుడు**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

కాలానుగుణంగా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టి పంటలను సాగు చేయాలని ఎడిఎ చంగల్ రాయుడు, ఎంపిడిఒ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. గురువారం చిప్పగిరి వెలుగు కార్యాలయంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన కూరగాయలను వాడడం వల్ల ఆరోగ్యం చాలా కుదుటపడుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో అనుసరించే విధానాలతో భూమిలో సారం పెరుగుతుందని, పంట దిగుబడులు కూడా పెరుగుతాయని చెప్పారు. ఆత్మ అధికారి మధు, ప్రకృతి వ్యవసాయ అధికారి రేవన్న, వెలుగు సిసిలు లక్ష్మన్న, శ్రీనివాసులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు ప్రదానం

**ప్రజాశక్తి - మంత్రాలయం**

గ్రామదేవత మంచాలమ్మ దేవర సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు బహుమతులు ప్రదానం చేశారు. గెలుపొందిన వారికి గురువారం టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు షీల్డ్ కప్‌లను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ... బుధవారం రాత్రి జరిగిన దేవర సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిం చారని తెలిపారు. ఈ పోటీల్లో చెన్నైకి చెందిన క్రీడాకారులు విజేతగా నిలిచారని, ఆ జట్టుకు రూ.20 వేలను వరదరాజులు, రన్నర్‌కు ఎంపిటిసి మేకల వెంకటేష్ రూ.10 వేలు, ఛాంపియన్ ట్రోఫీని అందజేశారు. టిడిపి మండల సెక్రటరీ కంసాలి నరసింహ, టిడిపి నాయకులు రఘు, టైగర్ రఘు, గుడిసె రాజన్న, మద్రి శివ, జగదీష్, టిబి.నరసింహ పాల్గొన్నారు.

## క్రీడలతో సామాజిక ఐక్యత

**- వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి**

**ప్రజాశక్తి - నందవరం :** క్రీడలతో సామాజిక ఐక్యత బలోపేతం అవుతుందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గురువారం నందవరం ఎస్సీ కాలనీలో జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లా సం, ఆరోగ్యం పెంపొందుతాయని తెలిపారు. పోటీలు యువతకు కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తూ, సామాజిక ఐక్యత బలోపేతం చేస్తాయన్నారు. అనంతరం నిర్వాహకులు, నాయకులు మాట్లాడారు. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి, ప్రచార విభాగం నియోజకవర్గ అధ్యక్షులు చాంద్ బాషా, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, పాస్టర్ బిఎన్.ప్రసాద్, జిల్లా యువజన, విద్యార్థి విభాగం కార్యదర్శి ప్రకాష్ రెడ్డి, మండల కార్యదర్శి బి.వెంకటేష్, రాజీవ్ యువ సేన నాయకులు చాంద్ బాషా, సీనియర్ నాయకులు చుక్క మల్లేష్, లింగమూర్తి, బుజ్జి బాబు, శాంతి రాజు, భాస్కర్, వరాలు, డీలర్ ఆదాం, గరకాయల దేవదాస్, పి.ఎసేపు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జగన్మోహన్ రెడ్డి

## రాఘవేంద్రుని సన్నిధిలో సీతారామిరెడ్డి

**ప్రజాశక్తి - మంత్రాలయం :** ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని వైసిపి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు వై.సీతారామిరెడ్డి గురువారం దర్శించుకున్నా రు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెం ట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేం ద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. రిటైర్డ్ తహశీల్దార్ వర్మ, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, నాయకులు గోర్కల్ కృష్ణస్వామి ఉన్నారు.

## సలీమా ఉస్తాద్‌బీ మృతి

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

గత 40 ఏళ్లుగా పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ యువతకు, పెద్దలకు ఖురాన్ చదివిస్తూ వారిచ్చే వేతనాలతో జీవనం సాగించిన సలీమా ఉస్తాద్ బీ (65) మృతి చెందారు. గత కొంత కాలంగా గుండె సమస్యతో బాధపడుతున్న ఆమె గురువారం అన్నమయ్య సర్కిల్ దగ్గరలోని వారి స్వగృహంలో మృతి చెందారు.

## రైతు సంక్షేమానికి కూటమి కృషి

**- టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్**

**ప్రజాశక్తి - నందవరం**

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్ తెలిపారు. గురువారం మండలంలోని ముగతి గ్రామంలో ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈరన్న గౌడ్, టిడిపి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ భార్గవ్ యాదవ్, గ్రామ అధ్యక్షులు గుగ్గిరి నరసింహులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ప్రశాంతి, చంద్రశేఖర్‌లు గ్రామ సచివాలయంలో రైతులకు యురియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారని, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. రైతులకు యూరియా కొరత లేకుండా ఎమ్మెల్యే బీవీ చర్యలు తీసుకుంటారని తెలిపారు. గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షులు కొండారెడ్డి, మాజీ సర్పంచి బాలరాజు, మాజీ ఉప సర్పంచి తాయన్న, ఫీల్డ్ అసిస్టెంట్ కడుబూరి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు యూరియా అందజేస్తున్న నాయకులు

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

**- ఎల్‌వి ప్రసాద్ కంటి హాస్పిటల్ సిబ్బంది**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

మండలంలోని ఏరూరు గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి వృద్ధులు, మహిళల నుంచి మంచి స్పందన లభించిందని ఎల్‌వి ప్రసాద్ కంటి హాస్పిటల్ సిబ్బంది వాసు, మల్లికార్జున తెలిపారు. గురువారం టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి దంపతుల ఆదేశాల మేరకు ఏరూరు ప్రాథమిక పాఠశాలలో జోలపురం లక్ష్మి, హరికృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో మహిళలు, వృద్ధులు కంటి చికిత్సలు, బీపీ, షుగర్ వంటి చికిత్సలు చేయించుకున్నారు. కంటి సమస్య ఉన్నవారికి బళ్లారి ఎల్‌వి ప్రసాద్ కంటి హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్ చేస్తామని, ఆపరేషన్ చేయించుకునేవారు ఆధార్ కార్డు తీసుకొస్తే గ్రామం నుంచి ఉచితంగా బస్సులో తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.



## కార్పొరేషన్ వద్దు.. జిల్లానే కావాలి

**- 33వ రోజుకు చేరిన దీక్ష**

**ప్రజాశక్తి - ఆదోని**

కార్పొరేషన్ చేస్తామని అధికారిక ప్రకటన రాక ముందే నాయకులు ఆదోని జిల్లా ఉద్యమాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, ఎవరూ నమ్మవద్దని ఆదోని జిల్లా సాధన సమితి జెఎసి కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ తెలిపారు. ఆదోని జిల్లా సాధనకు చేపట్టిన దీక్ష శిబిరం గురువారం 33వ రోజుకు చేరింది. షార్ట్ ఫిలిం కళాకారులు దీక్షలో కూర్చుని జిల్లా సాధన ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. జిల్లా సాధన సమితి జెఎసి నాయకులు నూర్ అహ్మద్, రఘురామయ్య, లలిత, వీరేష్, దస్తగిరి నాయుడు, కోదండ, తిరుమల, ఉదయ్, బాలకృష్ణ సందర్శించారు. జిల్లాగా ప్రకటించకుండా ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించేందుకు మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తామని రూ.500 కోట్లు నిధులు విడుదల చేయిస్తామని పొంతన లేని మాటలు చెప్పడం తగదన్నారు. షార్ట్ ఫిలిం ఆర్టిస్టులు కీరా, రంగ, సాయి మాట్లాడుతూ... కార్మికుల ఉద్యమానికి అండగా నిలుస్తామని తెలిపారు.

## క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

పట్టణంలోని ఎద్దుల మార్కెట్ వద్ద గల గ్రాండ్ మహల్ హోటల్ యజమాని ఇస్మాయిల్, షరీఫ్‌లు గ్రామీణ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఫిజికల్ డైరెక్టర్ హనీఫ్ ఆధ్వర్యంలో గురువారం గుడికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో రాష్ట్రస్థాయి క్రీడాకారులకు షార్ట్ అండ్ జెర్సీలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసప్ప మాట్లాడారు. క్రీడాకారులకు గ్రాండ్ మహల్ హోటల్ యజమాని ఇస్మాయిల్, షరీఫ్‌లు కలిసి దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్నీ సేవా కార్యక్రమాలు చేపట్టి పది మందికి ఆదర్శంగా నిలవాలన్నారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు బజారప్ప, హనీఫ్, ఆనంద్, ఉపాధ్యాయులు రంగస్వామి, ప్రసాద్, ఎర్రిస్వామి, ఈరన్న, నాగవేణి, నాగరాజు, వన్నూరప్ప, శ్రీధర్ పాల్గొన్నారు.

## 'కూటమితోనే పంచాయతీల అభివృద్ధి

**- సర్పంచి సుశీలమ్మ, టిడిపి నాయకులు సురేష్**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంతోనే పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయని సర్పంచి సుశీలమ్మ, టిడిపి సీనియర్ నాయకులు సురేష్ తెలిపారు. గురువారం బంటనహాల్ గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు సర్పంచి సుశీలమ్మ ఆధ్వర్యంలో ఎన్ఆర్జీ ఎస్ రూ.10 లక్షలు, పంచాయతీ నిధులు రూ.4 లక్షలు మొత్తం రూ.14 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి శివప్రసాద్ చొరవతో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయన్నారు. బంటనహాల్ గ్రామంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసి పరిష్కరిస్తున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రమీల, మాజీ సర్పంచి గోపాల్, కృష్ణమూర్తి, ఎర్రి స్వామి, శ్రీరాములు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సర్పంచి తనయుడు సురేష్, టిడిపి నాయకులు

## డివిజన్ స్థాయిలో ఎరిగేరి మొదటి స్థానం

**ప్రజాశక్తి - కౌతాళం**

ఆదోని డివిజనల్ స్థాయి రోటరీ క్లబ్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్, ఈవెంట్లలో ఎరిగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొదటి స్థానంలో నిలిచింఇ. కబడ్డీ పోటీల్లో దాదాపు 40 జట్టు తలపడ్డాయి. తమ పాఠశాల విద్యార్థులు మున్సిపల్ హై స్కూల్‌పై గెలిచి మొదటి స్థానం కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమేష్ నాయుడు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ... కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడానికి కృషి చేసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రామును ప్రత్యేకంగా అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ రాము రాకతో పాఠశాల రాష్ట్రస్థాయి కబడ్డీ, సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ అథ్లెటిక్స్‌లో దాదాపు 32 మంది పాల్గొన్నారని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాల ఆవరణం, గ్రౌండ్ లెవెలింగ్ పనులు సమృద్ధిగా జరిగాయని చెప్పారు. ఎంఇఒ శోభారాణి పాల్గొని వ్యాయామ ఉపాధ్యాయుని సన్మానించారు.

## నిందితులపై కేసు నమోదు : ఎస్ఐ

**ప్రజాశక్తి - మంత్రాలయం**

మండలంలోని చిలకలడోన గ్రామంలో పుటక భీమేష్, ఆయన తల్లి నరసమ్మ, సోదరి మంజులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన బోయ దేవేంద్ర, బోయ శివ కుమార్, బోయ వెంకటేష్‌లు భీమేష్ కుటుంబ సభ్యులపై కర్రలతో దాడి చేశారని తెలిపారు. గాయాలతో ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామానికి చెందిన నారాయణ, ఆంజనేయ, నాగేంద్ర జోక్యం చేసుకుని వారిని విడిపించారు. నిందితులు అసభ్య పదజాలంతో దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని అన్నారు.

## మిల్టన్ స్కూల్‌లో సపోజ్ క్రిస్మస్ వేడుకలు

**ప్రజాశక్తి - ఆదోని**

పట్టణంలోని మిల్టన్ స్కూల్ ప్రాంగణంలో గురువారం సపోజ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ విలియం సుజిత్ హాజరై క్రిస్మస్ పండగ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రసంగించారు. మిల్టన్ స్కూల్ కరస్పాండెంట్ రమేష్ బాబు మాట్లాడుతూ... విద్య అనేది పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా మానవీయ విలువలతో కూడిన సమగ్ర విద్యగా ఉండాలని తెలిపారు. స్కూల్ ప్రిన్సిపల్ బి.నాగరాజ్, సిఇఒ బి.వెంకటేష్ మాట్లాడుతూ... మిల్టన్ స్కూల్‌లో విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణను నేర్పుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రిస్మస్ గీతాలు, ప్రార్థనలు, సందేశాత్మక నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇన్‌ఛార్జీ సుశీల, లావణ్య, సునీత, అబ్రహాం ఉన్నారు.

## మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

**- ఆలూరు తహశీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు**

**ప్రజాశక్తి - ఆలూరు**



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

హత్తిబెళగల్ గ్రామ సమీపంలో మైనింగ్ పనులు చేపట్టి, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని, హత్తిబెళగల్ పరిధిలోని 969సిలో నిర్వహిస్తున్న క్వార్ట్జ మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని హత్తిబెళగల్ గ్రామస్తులు కోరారు. గురువారం గ్రామస్తులు ఈరన్న, షేక్షావలీ, పి.మౌలా, కమలాకర్ నాయుడు, కురువ రాజశేఖర్‌లు తహశీల్దార్ శోభ సువర్ణకు, ఎస్ఐ మన్మథ విజయ్‌కి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ... హత్తిబెళగల్ గ్రామానికి 150 మీటర్ల దూరంలో క్వార్ట్జ మైనింగ్ అనుమతులు అడ్డగోలుగా ఇచ్చారని తెలిపారు. మైనింగ్ పనుల వల్ల పాఠశాలలు, ఇళ్లు, తాగునీటి ట్యాంకులు, పొలాలు నాశనం అవుతాయని చెప్పారు. మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని గతంలో అనేకసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. 2017లో గ్రామ సమీపంలో క్వారీలో పేలుడు వల్ల 13 మంది కార్మికులు మృతి చెందారని గుర్తు చేశారు. మైనింగ్ పనుల వల్ల హత్తిబెళగల్, అగ్రహారం ప్రజలు భయాందోళన చెందుతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి మైనింగ్ అనుమతులను శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గ్రామస్తులు జగదీష్ స్వామి, రాజు, హనుమంతు, గౌడ పాల్గొన్నారు.

## సిఐ వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి -దేవనకొండ**



దేవనకొండ సిఐగా వి.వేణుగోపాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ క్రైమ్ మోసాలు ఎక్కువ జరుగుతున్నాయని, ప్రజలు సైబర్ క్రైమ్ వల్ల మోసపోకుండా అవగాహన కల్పిస్తామని తెలిపారు. గ్రామాల్లో మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్, బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. పొద్దుటూరు త్రీ టౌన్ సిఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. ఇక్కడ పని చేస్తున్న సిఐ వంశీనాథ్ పొద్దుటూరు టూ టౌన్‌కు బదిలీ అయ్యారు.

## చెరకు పంట దగ్ధం -రూ.1.5 లక్షలు నష్టం

**ప్రజాశక్తి - కౌతాళం**

ప్రమాదవశాత్తు చెరకు పంట దగ్ధమయి రూ.1.5 లక్షల నష్టం వాటిల్లిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఉరుకుంద గ్రామానికి చెందిన రైతు రవి చెరకు పంటను సాగు చేశారు. పంటలో ఏర్పడిన మంటలను చూసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఎకరా పంట కాలిపోవడంతో రూ.1.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిందా.. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా తెలియాల్సి ఉంది.



వివరాలు సేకరిస్తున్న అధికారులు